# కాలచక్రం కోరల్లో



-గోపరాజు ఉమానరసింహారావు

గుర్రాన్ని కొట్టి కొట్టి ఆయాసం వచ్చింది రాజయ్యకి. దెబ్బలు తన మీద పడుతున్నట్టు కాకుండా ఎవరి మీదో పడుతున్నట్టు ప్రవర్తిస్తోంది. అడుగు ముందుకెయ్యలేదు. మూడు రోజుల నుండి ఇదే పద్ధతి. ఇరవై సంవత్సరాలుగా ఎప్పుడూ చర్నాకోలతో అవసరం రాలేదు. కాని ఇప్పుడు చేతులు నెప్పి పుట్టేటట్టు కొట్టినా ఫలితం కనబడడం లేదు. ఏదో మందు తిన్నట్టు మందంగా వుంటోంది. ఒకప్పుడు రాజయ్య గుర్రబ్బండి మేఘాల్లో పరుగెడుతుందని పేరు వుండేది. చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా బండి ఎక్కడానికి అందరూ ఇష్టపడేవారు. ఎంతో మంది ఆడవాళ్ళు గర్భంతో ఆ బండి మీదే పట్నం ఆసుపత్రికెళ్ళి పండంటి పిల్లల్ని కని ఆ బండి మీదే చిన్నారి పాపల్ని ఎత్తుకుని సంతోషంగా తిరిగొచ్చారు. పెళ్ళయిన అమ్మాయిని అత్తారింటికి పంపడానికి రాజయ్య బండిని నెల రోజుల ముందే మాట్లాడుకుని వుంచుకునేవారు అమ్మాయిల తండ్రులు. ఎందుకో తెలియదుకాని రాజయ్య బండిలో ప్రయాణం చేస్తే వచ్చే సుఖం మరే బండెక్కినా ఆ ఊళ్ళో వాళ్ళకి రాదు.

గతకుల రోడ్డు మీద కూడా రాజయ్య బండిలో కూర్చుని ప్రయాణం చేస్తే విమానంలో ప్రయాణం చేసినట్టుంటుందని చాలా మంది అభిప్రాయం. గోధుమ రంగు వర్ణంతో చూడముచ్చటగా వున్న గుర్రం అంటే అందరికీ ఇష్టమే. తల్లులు మారాం చేస్తున్న పిల్లలకి ''రాజయ్య గుర్రం బండి ఎక్కిస్తా''మని ఆశ పెడతారు.

అంత గత వైభవం, చరిత్ర వున్న గుర్రం ఈనాడు కదలనని మొరాయిస్తోంది. బండికి కడదామని కాడి ఎత్తి పట్టుకుంటే కదిలి రావడమే లేదు. ఇదివరకు లేడిలా ఛెంగున దూకి వచ్చేసేది. గుర్రానికి పొగరెక్కిందనుకుని రెండు రోజుల నుండి గడ్డి కూడా వెయ్యడం లేదు. అలా చేస్తే పౌరుషం వచ్చి లేస్తుందని ఆశ పడితే అది కూడా నిరాశే అయ్యింది. జాలిగా చూడ్డం తప్ప మరేమీ చెయ్యలేదు అది.

''ఈ రోజు కూడా ఇంతే'' అనుకుంటూ ఇంట్లోకి నడిచాడు రాజయ్య. పనేమీ లేక పిచ్చెక్కినట్టుగా వుంది. కష్టపడి పని చెయ్యడం అలవాటు అయినవాళ్ళకి ఖాళీగా కూర్చోడం అన్నది పెద్ద శిక్షే. గుర్రం ఎందుకిలా ప్రవర్తిస్తోందో అర్థం కావడం లేదు. పోనీ ఏదైనా నలత చేసిందనుకుంటే చూడ్డానికి బాగానే వుంది.

* * *

మరునాడు ప్రొద్దున్న కొంచెం ఆలస్యంగా మెలకువొచ్చింది రాజయ్యకి. ఒళ్ళంతా నెప్పులుగా వుంది. లేవాలనిపించడం లేదు. అవయవాలేవీ స్వాధీనంలో లేవు. వంటింట్లోంచి కోడలి మాటలు వినబడుతున్నాయి.

''మీ నాన్న ఇంకా లేవలేదు. మూడు రోజుల్లో ఒక్క పైసా కూడా ఇంటికి తేలేదు. ఈయనకీ, గుర్రానికీ మేత దండగ'' కొడుకు కుక్కిన పేనులా పడి వున్నాడు తప్ప ఏ మాటా వినబడలేదు.

రాజయ్యకి మనస్సు చివుక్కుమంది. ఇన్ని సంవత్సరాలు శ్రమపడి సంపాదించి కుటుంబ భారాన్ని భుజాల మీద మోస్తే అది మర్చిపోయి మూడు రోజులు సంపాదన లేక పోయేసరికి ఎంత చులకనగా మాట్లాడుతోంది కోడలు? వయస్సు పెరిగి ఓపిక నశించి పోయిందన్న జాలి లేదు. అందరూ డబ్బు మనుషులై పోయారు. ఏ మనిషికైనా సంపాదిస్తేనే విలువ వుంటుంది.

రాజయ్య మదిలో హఠాత్తుగా ఒక ఆలోచన మెరిసింది. ''అవును కుటుంబ భారాన్ని లాగి లాగి నాకు ఓపిక నశించి పోతే, బండి భారాన్ని లాగి లాగి పాపం గుర్రానికి శక్తి అయిపోయింది. జీవ పరిణామంలో అది ఏ ప్రాణికైనా సహజమే. యుక్త వయస్సులోని ఓపిక వృద్ధాప్యంలో వుండదు. కోడలు చులకనగా మాట్లాడుతోందని బాధపడ్డాను తప్ప నేనేం చేశాను? గుర్రం పట్ల ఎంత క్రూరంగా ప్రవర్తించాను? దానికి నోరు లేదు కనుక చెప్పలేక పోయింది.'' అనుకుంటూ మెల్లగా లేచి పెరట్లో కెళ్ళాడు.

యజమానికి సేవ చెయ్యలేక పోతున్నానన్న బాధ వల్లనో, దెబ్బలకు తాళలేకనో తెలియదుగాని గుర్రం చచ్చి పోయింది. దాని ఒంటి మీద నిన్న చర్నాకోలాతో కొట్టిన దెబ్బల వల్ల కారిన రక్తం గడ్డకట్టి అసహ్యంగా కనబడుతోంది. ఈగలు ముసురుతున్నాయి. గుర్రం కళ్ళు మాత్రం బండినే చూస్తున్నాయి.